క్లుప్తంగా

ఎల్లమ్మకు విశేష పూజలు



పూజలందుకున్న ఎల్లమ్మ

పెద్దపంజాణి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని తుర్లపల్లి గ్రామంలో వెలసిన ఎల్లమ్మకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎల్లంకివారి పల్లె జెడ్పీ హైస్కూల్‌లో పనిచేసిన హెచ్‌ఎం సుమలతతోపాటు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శుక్రవారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సిద్ధారామయ్య, పోకల తాతయ్య, హెచ్‌ఎం హరిశంకర్ పాల్గొన్నారు.

దేవళంపేటలో త్వరలో ఆర్చి, గాలిగోపురం పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కొత్తగా ఆర్చి, గాలి గోపురం, కల్యాణ మండపం మంజూరైనట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తెలిపారు. శుక్రవారం గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ. 66 లక్షలతో గాలిగోపురం, ఆర్చి, రూ.కోటితో కల్యాణ మండపం మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు నాథమునిరెడ్డి, హేమసుందరరెడ్డి, మునిబాలసుబ్రమణ్యం, గోవిందరెడ్డి, దేవేంద్ర రెడ్డి, రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అర్చకులు అనంతాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మొక్కలను పెంచుదాం



మర్రి మొక్కలను నాటుతున్న దేవేంద్ర

పలమనేరు: పట్టణంలో మహావృక్షాలను పెంచాలనే తలంపుతో పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర శుక్రవారం పెద్ద చెరువు సమీపంలో మర్రి, రావి, వేప, మామిడి, చింత, నేరేడు మొక్కలను నాటారు. కనుమరుగవుతున్న మర్రి చెట్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు నాటే మొక్క భవిష్యత్తులో ఎన్నో తరాలకు మేలు చేస్తుందన్నారు. ఇలాంటి మొక్కలు కావాల్సిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణకు ఐక్యంగా పోరాడుదాం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత బ్రహ్మన్న

సోమల: ఎస్సీ వర్గీకరణకు మాదిగలంతా కలిసి పోరాడుదామని ఎమ్మార్పీఎస్ నాయకులు బ్రహ్మన్న, రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని కందూరులో సమావేశం నిర్వహించారు. మాదిగలు ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోగలమని తెలిపారు. నేతలు లోకేష్, లక్ష్మీపతి, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కుప్పం: సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కుప్పంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జగదీష్ బాబు తెలిపారు. బెంగళూరుకు చెందిన శంకర్ కంటి అస్పత్రి వైద్యులు నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని చెప్పారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు





మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, మామిడి చెట్లలో కొమ్మల కత్తిరింపుపై రైతులకు అవగాహన

–జిల్లా వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: మామిడి సాగులో పంట కోత అనంతరం చేపట్టే యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కరిడి వారిపల్లెలో రైతు వేణుగోపాల్‌రెడ్డి మామిడి తోట ఆవరణలో శుక్రవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి పంట కోత అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రెడ్డిరామ్ మాట్లాడుతూ, మామిడి తోటల్లో పంట కోత తరువాత చెట్ల కొమ్మల కత్తిరింపు తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. తోటల్లో జనుము, జీలుగ, పిల్లపిసర లాంటి పచ్చిరొట్టను ఇచ్చే పంటలను పెంచి కలియ దున్నాలన్నారు. 10 సంవత్సరాల మామిడి చెట్టుకు సుమారు 100 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల యూరియా, 5 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను చెట్టు మొదలు నుంచి 4 అడుగుల దూరంలో 30–45 సెంటీ మీటర్ల గాడి తీసి వేయాలని సూచించారు. మామిడి తోటను వాలుకు అడ్డంగా రెండు సార్లు దున్నాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ, ఉద్యానశాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించి మామిడి పంటను లాభసాటిగా చేసుకోవాలన్నారు.

ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసూన మాట్లాడుతూ, ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న శివకుమార్

చౌడేపల్లి: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ సహాయ పథక సంచాలకులు శివకుమార్ అన్నారు. శుక్రవారం పెద్దకొండామర్రి ఆర్బీకేను తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల స్టాకును పరిశీలించారు. అలాగే పంట నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. రైతులతో సమావేశమయ్యారు. డీఏపీ 50 కేజీల బస్తా రూ.1350, యూరియా 45 కేజీల బస్తా రూ.270 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్‌తో ఆర్బీకేలో సంప్రదించాలని తెలిపారు. అనంతరం కొత్త పంటలు, సాగు విధానం, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఓ జ్యోతమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామార్చన



లలితా సహస్ర నామార్చనలో భక్తులు

పలమనేరు: పట్టణంలోని పాతపేటలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక లలితా సహస్రనామార్చన జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

సామాజిక తనిఖీకి సహకరిద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందానికి అందరూ సహకరిద్దామని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారన్నారు. ఎంపీడీఓ రాజశేఖర్, నాథమునిరెడ్డి, నాగరాజ ప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు

గంగవరం: మండలంలోని మదర్‌థెరిస్సా కళాశాల వద్ద గురువారం తోపుడు బండ్లపైకి కారు దూసుకెళ్లిన సంగతి విధితమే. ఈ ప్రమాదంలో తులసి(25) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన దొరస్వామిరెడ్డి(46) వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఇద్దరికీ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శుక్రవారం మృతదేహాలను స్వగ్రామం మేలుమాయికి తరలించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం రేపు



పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పలమనేరు: పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో ఆదివారం జరగనున్న యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ యూటీఎఫ్ సభ్యులను కోరారు. సంఘం కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాన్ని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణమూర్తి, ప్రసన్నకుమార్, గురుమూర్తి, పురుషోత్తం, దయానంద పాల్గొన్నారు.

బదిలీ హెచ్‌ఎంకు సన్మానం



సన్మానం అందుకున్న హెచ్‌ఎం, టీచర్లు

పలమనేరు: గంటావూరు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన మునాఫ్, ఉపాధ్యాయులు గౌస్, అల్లాబక్షును ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం అన్సర్, టీచర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఓబుల్ రాజు

పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్థిసెన్సు ద్వారా నిజమైన పేదల నుంచి అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి వారికి, లేదా వారి వారసులకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ లోకేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. 20 సంవత్సరాలకు ముందు అన్యాక్రాంతమైన భూములను తిరిగి ఎవరికి ఇస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలను జయప్రదం చేయండి



సీఐ నుంచి అనుమతి తీసుకుంటున్న నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని బసవన్నకట్టవీధిలో ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో వచ్చే నెల 6వ తేదీ నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పట్టణ వాసులు పాల్గొని జయప్రదం చేయాలని సమితి నిర్వాహకుడు భాస్కర్ శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా కృష్ణుని ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ చంద్రశేఖర్ వద్ద అనుమతి పొందినట్లు తెలిపారు. సీఐని కలిసిన వారిలో సమితి సభ్యులు జ్యోతి, రెడ్డెమ్మ ఉన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ

సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీ చింతలవారిపల్లెలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంఈఓ శివరత్నమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. నాడు–నేడు ఫేస్ 2 కింద మంజూరైన పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఆర్సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

నేడు వైద్య సిబ్బందితో సమావేశం

చిత్తూరు రూరల్: ఇటీవల జరుగుతున్న ఘటనలపై చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి, చిన్న పిల్లల విభాగాల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్ తెలిపారు. ప్రసూతి విభాగంలోని సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందన్నారు.

భగవద్గీతపై తప్పుడు ప్రచారం



యూపీ వాసులను నిలదీస్తున్న బీజేపీ నాయకులు

పలమనేరు: భగవద్గీతను కించపరుస్తూ విమర్శనాత్మకంగా రచించిన పుస్తకాలను అమ్ముతున్న ఇద్దరు ఉత్తరప్రదేశ్ వాసులను స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం అడ్డుకున్నారు. వారిని స్థానిక పోలీసులకు అప్పగించారు. వివరాలు.. యూపీకి చెందిన కొందరు కొన్నాళ్లుగా పట్టణంలో భగవద్గీతలో ఉన్నవి తప్పంటూ కొన్ని పుస్తకాలను విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలియని స్థానికులు ఇవి అసలైన గీత పుస్తకాలేనంటూ కొనుగోలు చేశారు. అయితే అందులో సారాంశం గీతను కించపరిచేలా ఉంది. దీంతో ఆగ్రహించిన పలువురు హిందువులు బీజేపీ నాయకుడు తాతయ్యతో కలిసి బసవన్నకట్ట వీధిలో పుస్తకాలను అమ్ముతున్న ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వీటిని ఏ ఉద్దేశంతో విక్రయిస్తున్నారు? దీని వెనుక ఎవరున్నారనే విషయంపై పోలీసులు విచారిస్తున్నారు.

21న చేపల చెరువులకు వేలం

చౌడేపల్లి: మండలంలోని కాటిపేరి గ్రామ సచివాలయంలో ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు చేపల చెరువులకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సరితారెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలోని 3 పెద్ద చెరువులు, 15 కుంటల్లో చేపలు పెంచుకునేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. మూడేళ్లుగా చేపలు పెంచినా వాటిని పట్టకపోవడంతో అధిక మొత్తంలో చేపలు ఉన్నాయని తెలిపారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే టీసీ రాజన్

పలమనేరు: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ వారిని ధీటుగా ఎదుర్కొన్న జాతీయ నాయకుడు సుభాష్ చంద్రబోస్‌కు మరణం లేదని.. ఆయన ఎన్నటికీ భారతీయుల గుండెల్లో కొలువై ఉంటారని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమరయోధుడు టీసీ రాజన్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టీసీ రాజన్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ సైన్యానికి ధీటుగా ప్రైవేటు సైన్యాన్ని తయారు చేసి వారికి కంటిమీద కునుకు లేకుండా చేసిన ధీశాలి బోస్ అన్నారు. అలాంటి మహనీయుని బాటలో నేటి సమాజం పయనించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకరయ్య, బసప్ప, ఈశ్వరయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

26న సింగిల్‌విండో పెట్రోల్ బంకు ప్రారంభం



ఎద్దగొట్టిగల్లులో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్

రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగల్లులో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ఈ నెల 26వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారని జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ దేవులపల్లె హరినాథరెడ్డి శుక్రవారం తెలిపారు. సహకార బ్యాంకు ఆధ్వర్యంలో రూ.25 లక్షలు, హెచ్‌పీ పెట్రోల్ కంపెనీ రూ. 1.10 కోట్లతో తిరుపతి–మదనపల్లె రహదారిలోని పెద్దగొట్టిగల్లులో పెట్రోల్ బంక్‌ను నిర్మించామని అన్నారు. పెట్రోల్ బంక్‌ను ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి మంజూరు చేయించారని తెలిపారు. రస్తా పోరంబోకు స్థలంలో బంక్ నిర్మాణానికి మంత్రి అనుమతి తీసిచ్చారని చెప్పారు. దీంతో పనులు పూర్తి చేశామన్నారు. జిల్లాలోనే రొంపిచెర్ల సహకార సంఘం లాభాల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వ సహకారంతో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ వైఎస్సార్ చేయూత



మాట్లాడుతున్న పోకల చంద్ర

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్ చేయూత పథకంలో అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర తెలిపారు. గ్రామ సచివాలయంలో శుక్రవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. అయ్యావాండ్లపల్లె, దిగువపోకలవారిపల్లె పంచాయతీల్లో మొత్తం 110 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గంగయ్య, నాగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాసులు, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.2లక్షల పరిహారం



మృతుడి భార్యకు పరిహార పత్రం అందజేస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్

పుంగనూరు: మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పనిచేస్తూ గత నెల మృతిచెందిన గురునాథం కుటుంబానికి ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సాయం చేసింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్ అలీం బాషా శుక్రవారం మృతుడి భార్యకు చెక్కు అందజేశారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన కుప్పనపల్లి గ్రామస్తులు

బైరెడ్డిపల్లి: మండలంలోని కుప్పనపల్లి గ్రామస్తులు సుమారు 70 మంది శుక్రవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఉదయం బాటగంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు క్షేమంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకుంటున్నట్లు భక్తులు తెలిపారు.

కేంద్ర బృందం పర్యటన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పూతలపట్టు: మండలంలో కేంద్ర బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది. స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా శుక్రవారం కేంద్ర బృందం పి.కొత్తకోట పంచాయతీలోని ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించింది. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డంపింగ్ యార్డు, డ్రైనేజీ కాలువలు, మరుగుదొడ్లను పరిశీలించారు. సంబంధిత నివేదికను మొబైల్ ద్వారా కేంద్రానికి పంపించారు. కేంద్ర బృందం సభ్యులు రామమోహన్ నాగేంద్ర మాట్లాడుతూ పంచాయతీలో చెత్తాచెదారం లేకుండా, పరిశుభ్రంగా ఉంటే ఆ పంచాయతీని మోడల్ పంచాయతీగా కేంద్రం ప్రకటిస్తుందని తెలిపారు. సర్పంచ్ పద్మజారాణి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ మంజునాథ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో స.హ.చట్టం కమిషనర్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర సమాచారహక్కు చట్టం కమిషనర్ కట్ట జనార్దన్‌రావు దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా శుక్రవారం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేష్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వాదం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, జెడ్పీసీఈఓ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే దోమల కట్టడి సాధ్యం

చిత్తూరు రూరల్: పరిశుభ్రతతోనే దోమల కట్టడి సాధ్యమని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరం వీరభద్రకాలనీలోని శుక్రవారం ఆమె పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. కాలనీలోని పలు ఇళ్లను తనిఖీ చేసి కాలనీవాసులకు పలు సూచనలు చేశారు. ఇంటి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పీరు సాహెబ్, లలిత్, మనోహర్, గోపి తదితరులు పాల్గొన్నారు.